క్లుప్తంగా

పోలింగ్ కేంద్రం పరిశీలన


పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

వేపాడ: ఈనెల 13న నిర్వహించనున్న ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి స్థానిక ఉన్నత పాఠశాలలోని పోలింగ్ బూత్ నంబర్ -139 ను తహసీల్దార్ ఎస్.కృష్ణంరాజు, ఎంపీడీఓ బి.ఎస్.ఎస్.కె.పట్నాయక్, ఎస్ఐ రాజేష్ సోమవారం సందర్శించారు. విద్యుత్, తాగునీరు, ఇతర సదుపాయాలు కేంద్రంలో ఉన్నదీ లేనిదీ పరిశీలించారు.

ఆలయ నిర్మాణానికి రూ.50 వేల విరాళం

లక్కవరపుకోట: మండలంలోని లచ్చింపేట గ్రామంలో వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి కొత్తవలస మండలం వైఎస్సార్‌సీపీ నాయకులు పెదిరెడ్ల సూరిబాబు ఆలయకమిటీకి రూ.50 వేలు విరాళంగా సోమవారం అందజేశారు .కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు గౌతంశాస్త్రి, మధుకుమార్‌శర్మ, అల్లు గౌరినాయుడు, న్యాయవాది గుమ్మడి రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్.కోట ప్రత్యేక అధికారిగా శారదాదేవి


శారదాదేవి

లక్కవరపుకోట: మండల ప్రత్యేక అధికారిగా ఉపాధి హామీ పథకం ఏపీడీ ఎస్. శారదాదేవిని జిల్లా కలెక్టర్ నియమిస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారని ఎంపీడీఓ కె.రూపేష్ తెలిపారు. ఈమేరకు శారదాదేవి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం మండల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.

వ్యాసరచన, వక్తృత్వం పోటీలు


వ్యాసరచన పోటీలకు హాజరైన విద్యార్థులు

చీపురుపల్లి: ఈనెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక మండల విద్యావనరుల కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లోని 8, 9 తరగతుల విద్యార్థులకు సోమవారం ప్రతిభా పోటీలు నిర్వహించారు. 'మహిళా సాధికారత' అనే అంశంపై వ్యాసరచన, 'నవ సమాజ నిర్మాణంలో మహిళల పాత్ర' అనే అంశంపై వక్తృత్వం పోటీలు నిర్వహించారు. విజేతలుగా నిలిచిన వారికి 8న బహుమతులు అందజేయనున్నట్లు అధికారులు స్పష్టం చేశారు.న్యాయ నిర్ణేతలుగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కృష్ణవేణి, ఉపాధ్యాయులు రౌతు రాము వ్యవహరించారు.

శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యం


కేజీబీవీలో ఉపాధ్యాయ సిబ్బందితో మాట్లాడుతున్న అధికారులు

గజపతినగరం రూరల్: పదోతరగతి పబ్లిక్ పరీక్షల్లో కేజీబీవీ విద్యార్థినులు శతశాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలని మరుపల్లి కస్తుర్బాగాంధీ విద్యాలయం(కేజీబీవీ) ఉపాధ్యాయినులకు మండల ప్రత్యేక అధికారి దుర్గా ప్రసాద్ సూచించారు. కేజీబీవీని సోమవారం ఆయన సందర్శించారు. విద్యార్థినుల హాజరు, ఇతర రికార్డులతో పాటు ఉపాధ్యాయినుల బోధనతీరును పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయినులతో సమావేశం నిర్వహించారు. పదోతరగతి విద్యార్థినులు శతశాతం ఉత్తీర్ణత సాధించాలని, చదువులో వెనుకబడిన విద్యార్థినులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. సమస్యలు ఉంటే తమదృష్టికి తీసుకురావాలన్నారు. ఎంఈఓ విమల, ఇన్‌చార్జి ఎంపీడీఓ సుదర్శన్ పట్నాయక్ పాల్గొన్నారు.

సచివాలయాల కార్యదర్శులకు శిక్షణ

కొత్తవలస: గ్రామసచివాలయాల్లో భూములు, ఇళ్లు, వివాహాలు తదితర రిజిస్ట్రేషన్ సేవలు అందించనున్న నేపథ్యంలో మండలంలోని 8 సచివాలయాలకు సంబంధించిన కార్యదర్శులను శిక్షణ నిమిత్తం కొత్తవలస సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి అటాచ్ చేశామని ఎంపీడీఓ వై.పద్మజ సోమవారం తెలిపారు. వీరభద్రపురం, కాటకాపల్లి, కంటకాపల్లి, దేవాడ, కొత్తవలస-3, గులివిందాడ, గొల్లలపాలెం, సంతపాలెం సచివాలయాల కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లను శిక్షణకు పంపించామని చెప్పారు. వీరి శిక్షణా కాలం ఆరు నెలల పాటు ఉంటుందని, అంతవరకు వీరి స్థానాల్లో పలువురు కార్యదర్శులకు అదనపు బాధ్యతలను అప్పజెప్పామని పేర్కొన్నారు. ప్రస్తుతం ఆయా సచివాలయాల పరిధిలోని గ్రామాల్లో ప్రభుత్వం భూరీసర్వే చేయిస్తోందని చెప్పారు.

ఆధ్యాత్మిక సందడి


జామి: గొడికొమ్ములోని ఆలయంలో పంచముఖ ఆంజనేయస్వామిని దర్శించుకుంటున్న భక్తులు


బొండపల్లి: కొవ్వాడపేట రామాలయంలో పూజలందుకుంటున్న సీతారామలక్ష్మణులు

జామి: మండలంలోని గొడికొమ్ము గ్రామంలో పంచముఖ ఆంజనేయస్వామి ఆలయం వద్ద ఆలయ కమిటీ ఆధ్వర్యంలో తీర్థమహోత్సవం సోమవా రం ఘనంగా నిర్వహించారు. స్వామి వారిని అర్చకులు ఆరాధ్యుల సత్యనారాయణ ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేశారు. గ్రామంతో పా టు చుట్టు పక్కగ్రామాల భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారిని దర్శించుకున్నారు. తీర్థం సందర్భంగా ఏర్పాటు చేసిన కోలాటం తదితర సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

వైభవంగా రథయాత్ర

అన్నంరాజుపేట పంచాయతీ పుష్పగిరి గ్రామంలోని పురాతన వేణుగోపాలస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణమహోత్సవాల సందర్భంగా ఆదివారం రాత్రి వేద పండితులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామి వారి రథయాత్ర నిర్వహించారు. సోమవారం ఉదయం సుదర్శన హోమం చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఆలయ వార్షికోత్సవం

బొండపల్లి: మండలంలోని కొవ్వాడపేట గ్రామంలో సీతారామలక్ష్మణ సమేత ఆంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా వేకువ జాము నుంచి సాయంత్రం వరకు ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. గ్రామానికి చెందిన భక్తులతో పాటు చుట్టు పక్క గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చి పూజలు చేశారు.

భక్తిశ్రద్ధలతో శోభాయాత్ర

లక్కవరపుకోట: మండలంలోని చందులూరు పంచాయతీ పరిధి కళిరెడ్డిపాలెం గ్రామ సమీపంలో భ్రమరాంబిక సమేత మల్లికార్జునస్వామి ఆలయ పునఃప్రతిష్ఠోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. నాలుగురోజుల పాటు ఈ ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. పండితులు వెంకటసతీష్‌స్వామి ఆధ్వర్యంలో తొలిరోజు దేవతామూర్తుల విగ్రహాల శోభాయాత్రను(ఊరేగింపు) భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఎంపీటీసీ యడ్ల కిశోర్,వైస్ సర్పంచ్ రొంగలి రామారావు, వైఎస్సార్‌సీపీ నాయకులు యడ్ల సత్యారావు తదితరులు పాల్గొన్నారు.


జామి: పుష్పగిరిలో వేదపండితుల ఆధ్వర్యంలో వేణుగోపాలస్వామి రథయాత్ర


లక్కవరపుకోట : చందులూరు గ్రామంలో దేవతా మూర్తుల విగ్రహాల శోభాయాత్ర

పార్టీ విజయానికి సమష్టిగా పని చేద్దాం

- గృహసారథుల సమావేశంలో ఎమ్మెల్యే అప్పలనరసయ్య, ఎమ్మెల్సీ సురేష్‌బాబు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే అప్పలనరసయ్య, వేదికపై ఎమ్మెల్సీ సురేష్‌బాబు

గంట్యాడ: గ్రామస్థాయిలో వైఎస్సార్‌సీపీని మరింత పటిష్టం చేసి రానున్న ఎన్నికల్లో మళ్లీ పార్టీ విజయం సాధించడమే లక్ష్యంగా గృహసారథులు, పార్టీనాయకులు, కార్యకర్తలు క్షేత్రస్థాయిలో సమష్టిగా సైనికుల్లా పనిచేద్దామని గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య, ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్ బాబు అన్నారు. మండలంలోని పెదవేమలి, మురపాక, సిరిపురం, రామవరం, లక్కిడాం, వసంత గ్రామాల్లో గృహసారథులు, సచివాలయ కన్వీనర్లతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామస్థాయిలో పార్టీని మరింత పటిష్టం చేయడమే లక్ష్యంగా గృహసారథులను నియమించినట్లు చెప్పారు. ఈనెల 18వ తేదీ నుంచి వారం రోజుల పాటు 'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పార్టీ కార్యకర్తలు అంతా ఈ కార్యక్రమంలో పాల్గొంటా రని తెలిపారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమం, అభివృద్ధిని వివరించడంతో పాటు వారి సమస్యలను తెలుసుకోవాలని చెప్పారు. అలాగే ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ తరఫున పోటీ చేస్తున్న సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలని ఆయా గ్రామాల్లోని పట్టభద్రులను కోరారు. విశాఖపట్నంలో ఇటీవల నిర్వహించిన గ్లోబల్ సమ్మిట్ విజయవంతమైందని, రాష్ట్రంలో పరిశ్రమలు నెలకొల్పేందుకు, పెట్టుబడులు పెట్టేందుకు అంబాని లాంటి బడా పారిశ్రామికవేత్తలు ప్రభుత్వంతో ఎంఓయూలు కుదుర్చుకున్నారని వివరించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు పీరుబండి జైహింద్‌కుమార్ , ఏఎంసీ చైర్మన్ వేమలి ముత్యాలనాయుడు, ఎంపీటీసీ పాటుపురెడ్డి భవాని, సర్పంచ్ వర్రి పాపునాయుడు, పార్టీ నాయకులు నారాయణమూర్తిరాజు, పి.నారాయణ మూర్తి, రంభ సత్యారావు, లచ్చిరెడ్డి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికతో లక్ష్య సాధన


విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ప్రొఫెసర్ హిమజ

బొండపల్లి: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని, వాటి సాధనకు ప్రణాళికాబద్ధంగా చదవాలని కేజీహెచ్‌లోని ఆంధ్రా మెడికల్ కళాశాల సహాయ ప్రొఫెసర్ జి.హిమజ సూచించారు. గొట్లాం గ్రామంలోని శ్రీ గాయత్రీ విద్యా సంస్థలో సోమవారం సాయంత్రం పదోతరగతి, ఇంటర్ ద్వితీయ సంవత్సర విద్యార్థుల ఫేర్‌వెల్ వేడుకలను మిగతా తరగతుల విద్యార్థులు నిర్వహించారు. అతిథిగా హాజరైన ప్రొఫెసర్ హిమజ మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి పోటీతత్వాన్ని అలవరచు కొని ముందుకు సాగాలని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. శ్రీగాయత్రీ విద్యా సంస్థల కరస్పాండెంట్ జి.ఎరుకునాయుడు, జి.జగదీశ్వరి, ఏఓ జి.రాఘవ తదితరులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలను విస్తృతం చేయాలి

- లయన్స్ క్లబ్ గవర్నర్ ఉషారాజు


చీరలు పంపిణీ చేస్తున్న లయన్స్ క్లబ్ గవర్నర్ ఉషారాజు

చీపురుపల్లి: లయన్స్‌క్లబ్, స్టార్స్ లయన్స్‌క్లబ్‌ల ఆధ్వర్యంలో సామాజిక సేవా కార్యక్రమాలను విస్తృతం చేయాలని లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ ఎం .ఉషారాజు సూచించారు. పట్టణంలోని లయన్స్, స్టార్స్ లయన్స్ క్లబ్‌లను ఆదివారం రాత్రి ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సేవా కార్యక్రమాల్లో రాష్ట్రంలోనే విజయనగరం జిల్లా లయన్స్ క్లబ్ ప్రథమ స్థానంలో ఉందని, దీనికి జిల్లాలోని అన్ని క్లబ్‌లు అందిస్తున్న సేవలే ప్రధాన కారణమని చెప్పారు. చీపురుపల్లి లయన్స్‌క్లబ్, స్టార్స్ క్లబ్ పని తీరు చాలా చక్కగా ఉందని, నూతన సభ్యులను చేర్పించడంలో చురుకైన పాత్ర పోషిస్తూ ఆదర్శంగా నిలుస్తుండడంపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శాశ్వత అన్నదాన పథకం లబ్ధిదారులు 30 మందికి చీరలు పంపిణీ చేశారు. అలాగే మందిరవలస ప్రాథమిక పాఠశాలకు మైక్‌సెట్ అందజేశారు.కార్యక్రమంలో లయన్స్, స్టార్స్ క్లబ్ అధ్యక్షులు బెల్లాన వంశీకృష్ణ, కె.తవిటిరాజు, జీఎంటీ కో-ఆర్డినేటర్ ఎస్.సన్యాసిరావు, కమలాకర్, రామకృష్ణ, టి.వి.వి.ఎస్.ఎన్.రాజు తదితరులు పాల్గొన్నారు.

శతశాతం పశువులకు టీకాలు


పశువైద్య సహాయకులకు సూచనలు చేస్తున్న ఏడీ గంగాధర్

కొత్తవలస: గాలికుంటు వ్యాధి నివారణకు ప్రభుత్వం ఉచితంగా అందజేస్తున్న టీకాలను శతశాతం పశువులకు వేయాలని పశుసంవర్ధక శాఖ ఏడీ బి.గంగాధర్ సూచించారు. స్థానిక ప్రాంతీయ పశువైద్యకేంద్రంలో లక్కవరపుకోట, కొత్తవలస మండలా ల్లోని రైతుభరోసా కేంద్రాల పశువైద్య సహాయకులతో సోమవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ కొత్తవలస మండలంలో ఆవులు,గేదులు 11,100, లక్కవరపుకోట మండలంలో 15,500 ఉన్నట్లు తెలిపారు. వీటన్నింటికీ ఈనెలాఖరు నాటికి టీకాలు వేయాలని ఆదేశించారు. అలాగే ప్రభుత్వం 60శాతం రాయితీపై అందజేస్తున్న సమీకృత దాణాపై పాడి రైతులకు అవగాహన కల్పించాలన్నారు. పశుకిసాన్ కార్డులపై పాడిరైతులకు బ్యాంకులు రుణాలు అందజేసే విధంగా కృషి చేయాలని సూచించారు.

పెంచిన గ్యాస్ ధరలు తగ్గించాలి


రాస్తారోకో చేస్తున్న మహిళా సమాఖ్య సభ్యులు, ఏఐటీయూసీ నాయకులు

శృంగవరపుకోట: కేంద్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు వంట గ్యాస్ ధరలను పెంచుతూ ప్రజలపై భారం మోపుతోందని, పెంచిన ధరలను తగ్గించాలని కోరుతూ ఏపీ మహిళా సమాఖ్య సభ్యులు సోమవారం స్థానిక ఆర్టీసీకాంప్లెక్ వద్ద రాస్తారోకో నిర్వహించారు. రోడ్డుపై ఖాళీ సిలిండర్లను పేర్చి వాటికి పూజలు చేస్తూ నిరసన తెలిపారు. ఏపీ మహిళా సమాఖ్య జిల్లా గౌరవాధ్యక్షురాలు మద్ది మాణిక్యం మాట్లాడుతూ ప్రధాని మోదీ నేతృత్వంలో దేశంలో ధరల మోత మోగుతోందని, మధ్యతరగతి ప్రజలు బతకలేని దుస్థితి వచ్చిందని, నిత్యవసరాల ధరలు నింగిని అంటుతున్నాయని మండిపడ్డారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన రోజు రూ.414 ఉన్న వంటగ్యాస్ ధర నేడు రూ.1150కి చేరిన విషయాన్ని ప్రజలు గమనించాలన్నారు. మహిళా సమాఖ్య నాయకులు షేక్‌చాంద్ బీబీ, ఏ.పార్వతి, వి.లక్ష్మి, ఏఐటీయూసీ అనుబంధ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు గృహసారథుల సమావేశం

బొండపల్లి: మండలంలోని ఆరు గ్రామాల గృహసారథులతో ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య మంగళవారం సాయంత్రం సమావేశం కానున్నారని ఎంపీపీ చల్ల చలంనాయుడు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఈదుబిల్లి కృష్ణ, సచివాలయాల కన్వీనర్ల మండల కో-ఆర్డినేటర్ పల్లి రఘు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. రాచకిండాం,రయింద్రాం,చామలవలస, కనిమెరక, బోడసింగిపేట, గిట్టుపల్లి గ్రామాల్లో సమావేశాలతో పాటు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నారని పేర్కొన్నారు. ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు హాజరు కావాలని కోరారు.

రాజకీయ పార్టీ నేతలతో సమావేశం నేడు

లక్కవరపుకోట: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో రాజకీయపార్టీల నేతలతో మంగళవారం సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కె. రూపేష్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని కళ్లేపల్లి, ఖాసాపేట, కొట్యాడ ఎంపీటీసీ సెగ్మెంట్‌లకు త్వరలో ఉప ఎన్నికలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఎన్నికలకు సంబంధించి ఇటీవల ప్రచురించిన పోలింగ్ ముసాయిదా జాబితాపై అభ్యంతరాలుంటే మంగళవారం నిర్వహించనున్న సమావేశంలో రాజకీయపార్టీల నేతలు చెప్పవచ్చని పేర్కొన్నారు.

నేటి నుంచి సోంపురంలో ముత్యాలమ్మ తీర్థం

వేపాడ: మండలంలోని సోంపురం గ్రామదేవత ముత్యాలమ్మ తల్లి తీర్థ మహోత్సవం మంగళవారం నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్నట్లు గ్రామపెద్దలు సోమవారం తెలిపారు. మూడురోజులూ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయనున్నామని, అలాగే వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామని చెప్పారు. బుధవారం గుర్రాల పరుగు ప్రదర్శన, గురువారం ఎడ్ల పరుగు ప్రదర్శన నిర్వహించి విజేతలకు నగదు బహుమతులు అందజేయనున్నామని తెలిపారు.

సమస్యలకు తక్షణ పరిష్కారం


కొత్తవలస: అర్జీల వివరాలను నమోదు చేస్తున్న ఎంపీడీఓ పద్మజ, తహసీల్దార్ ప్రసాద్‌రావు


జామి: స్పందన నిర్వహిస్తున్న అధికారులు


చీపురుపల్లి: అధికారులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ రామకృష్ణరాజు

ప్రజాసమస్యల పరిష్కారవేదిక 'స్పందన' కార్యక్రమంలో ప్రజలు అందించే అర్జీలకు తక్షణ పరిష్కారం చూపాలని మండల అధికారులకు ప్రత్యేక అధికారులు, ఎంపీడీఓలు ఆదే శించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గజపతినగరం, బొండపల్లి, దత్తిరాజేరు, ఎల్.కోట, కొత్తవలస, వేపాడ, జామి, చీపురుపల్లి మండల పరిషత్ కార్యాలయాల్లో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఎల్.కోట, వేపాడ, చీపురుపల్లిలో ఒక్క అర్జీ కూడా అందలేదని అధికారులు చెప్పారు. మిగతా చోట భూసంబంధ, విద్యుత్, తదితర సమస్యలపై, పట్టాదారు పాస్‌పుస్తకాలు అందించాలని ప్రజలు అర్జీలు అందజేయగా.. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఆయా శాఖల అధికారులు తెలిపారు. అనంతరం అధికారులు శాఖల వారీగా సమీక్ష నిర్వహించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని ఎంపీడీఓలు, స్పెషల్ ఆఫీసర్లు సూచించారు.

– చీపురుపల్లి,గజపతినగరం, బొండపల్లి, దత్తిరాజేరు, ఎల్.కోట, కొత్తవలస, వేపాడ, జామి

పైథాన్ లాంగ్వేజ్‌తో ఉద్యోగ అవకాశాలు


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ జాషువాజయప్రసాద్

చీపురుపల్లి రూరల్ (గరివిడి): ఇంజినీరింగ్ విద్యార్థులు పైథాన్ ప్రోగ్రామింగ్ లాంగ్వేజ్‌పై పట్టు సాధిస్తే మంచి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని గరివిడిలోని అవంతి సెయింట్ థెరీసా ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.జాషువాజయప్రసాద్ అన్నారు. పైథాన్ ప్రోగ్రామింగ్ లాంగ్వేజ్ అప్లికేషన్స్‌పై మూడురోజులుగా నిర్వహించిన వర్క్ షాప్ సోమవారం ముగిసింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కంప్యూటర్ లాంగ్వేజ్‌లో పైథాన్ ప్రోగ్రామింగ్ ముఖ్యపాత్ర వహిస్తోందని అన్నారు. ఈలాంగ్వేజ్‌పై పట్టు సాధిస్తే మల్టీ నేషనల్ కంపెనీల్లో ఉద్యోగాలు సాధించవచ్చని చెప్పారు. రిసోర్స్ పర్సన్ ప్రవాస్‌రంజన్ సాహూ, వైస్ ప్రిన్సిపాల్ బి.వెంకటరమణ, ఏఓ జి.అనిల్ కుమార్, సీఎస్‌సీ విభాగాధిపతి ఎం.ఉమామహేశ్వరరావు, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచార హోరు


కొత్తవలస: కొత్తవలసలో ఆర్యవైశ్య సంఘం నాయకుల మద్దతు కోరుతున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు


దత్తిరాజేరు: పెదమానాపురంలో ప్రచారం చేస్తున్న జెడ్పీటీసీ రాజేశ్వరి, సర్పంచ్ దాసు

ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సమయం దగ్గరపడుతుండంతో గ్రామాల్లో ప్రచారం జోరందుకుంది. వైఎస్సార్‌సీపీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్ తరఫున పార్టీ నాయకులు సోమవారం ప్రచారం నిర్వహించారు. కార్యాలయాలు, ఇళ్లకు వెళ్లి సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని పట్టభద్ర ఓటర్లను అభ్యర్థించారు. కొత్తవలసలో ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులతో ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు సమావేశమయ్యారు. అలాగే పలు ప్రైవేటు పాఠశాలల్లో ఉపాధ్యాయులను కలిసి సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధి,సంక్షేమ పాలనను చూసి ఆయన బలపరిచిన సుధాకర్‌ను గెలిపించాలని కోరారు.

– శృంగవరపుకోట, కొత్తవలస, దత్తిరాజేరు, చీపురుపల్లి


కొత్తవలస: కొత్తవలసలోని ఓ ప్రైవేటు పాఠశాల ఉపాధ్యాయుల మద్దతు కోరుతున్న ఎమ్మెల్యే కడుబండి


శృంగవరపుకోట: ఎస్.కోటలో ప్రైవేటు పాఠశాల ఉపాధ్యాయులను ఓటు వేయాలని కోరుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు


చీపురుపల్లి: చీపురుపల్లి పట్టణంలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు